క్లుప్తంగా

పదోన్నతి బాధ్యతలను మరింత పెంచుతుంది: ఎస్పీ



నారాయణపేట: ఉద్యోగ జీవితంలో పదోన్నతి అనేది బాధ్యతలను మరింత పెంచుతుందని ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. దామరగిద్ద పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సురేష్ ఇటీవల ఎఎస్ఐగా పదోన్నతి పొందారు. ఈ క్రమంలో సోమవారం ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. ఎస్పీ సురేష్‌ను అభినందించి విధులను మరింత బాధ్యతగా నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ రియాజ్ హుల్‌హక్ పాల్గొన్నారు.

డ్రైయినేజీ, సీసీ రోడ్డు పనులు ప్రారంభం



కృష్ణా: మండలంలోని కున్సీ గ్రామంలో సోమవారం ఎస్సీ కాలనీలో డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులను గ్రామ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ సబ్‌ప్లాన్ క్రింద రూ.13 లక్షల నిధులు మంజూరు కావడంతో 200 మీటర్ల డ్రైనేజీ, 180 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక నేతలు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు అంజప్పగౌడ్, సోమశేఖర్‌గౌడ్, మాజీ ఉప సర్పంచ్ నర్సప్ప, బాల్‌రాజ్, కాంగ్రెస్ అధ్యక్షుడు రాజప్పగౌడ పాల్గొన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

కోస్గి రూరల్: పంటల సంరక్షణకు శాస్త్రవేత్తలు అందించే సూచనలను రైతులు పాటించాలని గుండుమాల్ మండల వ్యవసాయ అధికారిణి రేష్మారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం జరగనున్న 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమానికి ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ నుంచి పలువురు శాస్త్రవేత్తలు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రైతులు అధిక సంఖ్యలో వచ్చి తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

నారాయణపేట రూరల్: మండలంలోని కొల్లంపల్లి గ్రామ హజ్రత్ ఖతాల్ హుస్సేని దర్గాలో సోమవారం భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్ కుమార్ రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా అక్కడి పెద్దలతో మాట్లాడి దర్గా విశిష్టతను తెలుసుకున్నారు. అనంతరం పక్కనే ఉన్న ఉర్దూ పాఠశాలను సందర్శించి అక్కడి సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎల్ఓసీలు అందజేసిన ఎమ్మెల్యే వాకిటి



మాగనూర్(మక్తల్): పేదలకు సీఎం సహాయ నిధి పథకం ఒక వరమని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న మక్తల్ పట్టణానికి చెందిన సుకన్య, మహేశ్వరి, వాణిశ్రీ, షేక్ జహంగీర్‌లకు వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన నిధులకు సంబంధించి ఎల్ఓసిలను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయండి



నర్వ: వరి కొనుగోళ్లను వేగవంతం చేయాలని తహసీల్దార్ మల్లారెడ్డి ఆదేశించారు. సోమవారం రాంపూర్‌గేట్ వద్ద గల సాయిరాం, జయంత్ రైస్ మిల్లులను రెవెన్యూ సిబ్బంది ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు లోబడి రైతుల నుంచి వరి దాన్యం కొనుగోలు చేయాలని మిల్లర్లకు సూచించారు. ఇటీవల కొన్ని మిల్లుల్లో తరుగు ఎక్కువగా తీస్తున్నారని ఫిర్యాదులు రావడంతో తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో సీనియర్ అసిస్టెంట్ శ్రీశైలం, ఆర్ఐ ఆశా తదితరులున్నారు.

వైభవంగా నర్సింహస్వామి కల్యాణం



స్వామి వారి కల్యాణమహోత్సవం

మాగనూర్: మండల కేంద్రంలో వెలసిన శ్రీ లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం తెల్లవారుజామున ప్రభోత్సవం కార్యక్రమం జరగగా ఉదయం 9 గంటలకు స్వామి వారి కల్యాణమహోత్సవం కనుల పండుగగా జరిగింది. ఈ నెల 11వ తేదీన ప్రారంభమైన స్వామి వారి బ్రహోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు సౌకర్యార్థం ఆలయ కమిటీ సభ్యులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. అలాగే మంగళవారం తెల్లవారుజామున 5 గంటలకు స్వామివారి రథోత్సవం, సాయంత్రం 5 గంటలకు పాల ఉట్లు కార్యక్రమం నిర్వహించనున్నారు. మాగనూర్ ఎస్ఐ అశోక్‌బాబు ఆధ్వర్యంలో జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఘనంగా మహారథోత్సవం

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని షోడశబాహు లక్ష్మీనరసింహ శ్రీరాఘవేంద్ర స్వామి ఆలయంలో సోమవారం రెండోరోజు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయ ప్రాంగణంలో మహా రథోత్సవ వేడుకలు జరిగాయి. ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు పంచామృత అభిషేకం, పుష్పార్చన అలంకరణ వసంత పూజ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు నరసింహచారి, విద్వాన్ అనిల్ దేశాయి, శ్రీ రాఘవేంద్ర సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ఎడ్లబండ్ల గిరక పోటీలు

నర్వ: మండలంలోని పాథర్చేడ్ గ్రామంలో వీరాంజనేయస్వామి జాతర బ్రహ్మోత్సావాలను పురస్కరించుకొని సోమవారం అట్టహాసంగా ఎడ్లబండ్ల గిరక పోటీలు నిర్వహించారు. పోటీలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బీసం చెన్నయ్యసాగర్ ప్రారంభించారు. దాతలు లంకాల మహేష్, ఎస్ఎస్ రాములు మొదటి బహుమతి 9 తులాల వెండిని, రెండో బహుమతి దాత రాజు 5 తులాల వెండిని, మూడో బహుమతి దాత చెన్నప్ప 2 తులాల వెండిని విజేతలైన రైతులకు అందించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వివేకవర్ధన్‌రెడ్డి, శరణప్ప, అశోక్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రాఘవేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రత్యేక పూజలు

ఊట్కూరు: ఊట్కూరులోని ఎల్బీనగర్ వీధిలో సోమవారం పౌర్ణమి సందర్భంగా రథోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం కళశ ఊరేగింపు, స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. సాయంత్రం 25 అడుగుల రథాన్ని అలంకరించి రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ప్రశాంత్‌రెడ్డి పాల్గొని పూజలు జరిపించారు.

గ్రామ దేవతలవిగ్రహాల ప్రతిష్ఠ

మరికల్: మండలంలోని రాకొండ గ్రామంలో గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్ర మం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణులు లక్ష్మమ్మ, మైసమ్మ విగ్రహాలను వేద మంత్రోచ్ఛరణల మధ్యన ప్రతిష్ఠించారు. అనంతరం మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేక పూజలు జరిపించారు. గ్రామ దేవతలను మాజీ డీసీసీ అధ్యక్షులు కుంభం శివకుమార్‌రెడ్డి, జిల్లా నాయకులు సూర్యమోహన్‌రెడ్డి దర్శించుకున్నారు.

బీరప్ప బండారు ఉత్సవాలు

మరికల్: మండలంలోని మాధవరం గ్రామంలో సోమవారం బీరప్ప పసుపు బండారు ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఐదు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే పసుపు బండారు ఉత్సవాల్లో కుర్వ కులస్తులు ఒకరిపై ఒకరు పసుపు చల్లుకొని వేడుకలను నిర్వహించుకున్నారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు సూర్యమోహన్‌రెడ్డి వారిపై బండారు వేసి పండగ శుభకాంక్షలు తెలిపారు. అనంతరం బంధువులు తెచ్చిన నూతన వస్త్రాలను ధరించి బీరప్ప దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా పల్లకీ సేవా

నారాయణపేట రూరల్: పట్టణంలోని శ్రీ సత్యనారాయణస్వామి దేవాలయంలో సోమవారం జాతర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు ఉదయం స్వామివారికి అమృతాభిషేకం, అర్చన, అలంకరణ, హారతి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం పట్టణ పురవీధుల గుండా స్వామివారి విగ్రహాన్ని ఊరేగిస్తూ పల్లకి సేవా చేపట్టారు.

బసవేశ్వర స్వామి రథోత్సవం

నారాయణపేట రూరల్ : స్థానిక సరాఫ్‌బజార్‌లోని శ్రీబసవేశ్వరస్వామి దేవాలయంలో ధర్మకర్త బుస్సయ్యస్వామి నేతృత్వంలో సోమవారం ఘనంగా పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆలయంలోని బసవేశ్వరుడు, వీరభద్రేశ్వరుడి మూల విరాట్‌లకు మంజునాథ్, విశ్వనాథ్‌స్వామి పంచామృతాభిషేకం, బిల్వార్చన, పుష్పలంకరణ, మహామంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రాత్రి సమయంలో ప్రత్యేకంగా అలంకరించిన రథంపై స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని పెట్టి మేళతాళాలతో, భక్తుల కోలాహలం మధ్య రథోత్సవం నిర్వహించారు.



ఉత్సవాల్లో జిల్లా కాంగ్రెస్ పార్టీ నేత సూర్యమోహన్‌రెడ్డి

ఆంజనేయస్వామి ఉత్సవాలు

మరికల్: మండలంలోని పెద్దచింతకుంట గ్రా మంలో కొలువైన ఈశ్వర ఆంజనేయస్వామి బ్ర హ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నా యి. ఉత్సవాల్లో భాగంగా గ్రామస్తులు జల్ది బిందెను ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామి వారికి అభి షేకం చేశారు.అనంతరం అలంకరణ కార్యక్ర మం నిర్వహించారు.11 మంది దంపతులు సుదర్శన హోమం చేశారు.అనంతరం జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ అభివృద్ధికి రూ.25 వేలను వితరణ చేశారు. అలాగే ఎమ్మెల్యే పర్ణికారెడ్డి నిధుల కింద రూ.లక్ష ఆర్థిక సాయం చేశా రు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాణికేశ్వరి మాత పాదపూజ

నారాయణపేట రూరల్: పగిడిమర్రి రోడ్డులో వెలసిన వీరధర్మజ (మాణికేశ్వరి)మాత ఆశ్రమంలో సోమవారం బుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, అమ్మవారి పాదుక అభిషేకం, గాయత్రి యజ్ఞం, నాగ సింహాసన పూజలు భక్తిశ్రద్ధలతో జరిపించారు. మధ్యాహ్నం మహా మంగళహారతి అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేశారు.



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

చెరువుల నుంచి నీటి విడుదల ఆపేయండి



మాగనూర్: మండల కేంద్రంలోని గ్రామ పెద్ద చెరువు నుంచి నీటి విడుదలను ఆపేయాలని మాగనూర్ రైతులు కోరుతున్నారు. కొందరు వ్యక్తులు చెరువులోని చేపలు పట్టేందుకు సాగునీరును వృథాగా కిందకు వదులుతున్నారని మాగనూర్ గ్రామ రైతులు సోమవారం ఇంఛార్జి తహసీల్దార్ సురేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం యాసంగి పంటల కోతలు అయిపోవడంతో కొందరు తుమ్ముల ద్వారా చెరువులోని సాగు నీటి వృథాగా వదిలేస్తున్నారన్నారు. వెంటనే తుమ్ములను బంద్ చేయించి నీటి విడుదల చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు ఆంజనేయులు, బల్‌దాస్ నర్సింహులు, దేవప్ప, జంగిటి అంజప్ప పాల్గొన్నారు.

వాల్మీకుల ఐక్యతకు గ్రామ కమిటీల ఏర్పాటు



నర్వ: వాల్మీకి బోయల ఐక్యత కోసం గ్రామ గ్రామాన నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు వాల్మీకి సంఘం జిల్లా నాయకులు గడ్డం నర్సింములు అన్నారు. సోమవారం నాగిరెడ్డిపల్లి గ్రామ వాల్మీకి బోయ గ్రామ కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఎన్నికలో జిల్లా, మండల నాయకులు పాల్గొని నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షులుగా జంగిటి చిన్న రాజు, ఉపాధ్యాక్షులుగా కావలి రాములు, చెన్నరాయుడు, కురుమన్న, ప్రధాన కార్యదర్శిగా రామాంజనేయులు, కార్యదర్శిగా కోట హరీష్, ప్రచార కార్యదర్శిగా టీచర్ రాజు, కార్యవర్గ సభ్యులుగా మహేష్, వెంకటన్న, రాజు, రామచంద్రి, కురుమన్నలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఘనంగా నర్సన్నతాత జాతర



ప్రత్యేక పూజల్లో ఎంపీ డీకే అరుణ

ఊట్కూర్: మండలంలోని కొల్లూర్ గ్రామంలో మూడు రోజులుగా శ్రీశ్రీ నర్సన్న తాత జాతర ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఎంపీ డీకే అరుణ ఉత్సవాల్లో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఊట్కూర్‌లోని ఎల్బీ నగర్ ఆంజనేయ స్వామి ఉత్సవాల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. దేవాలయ కమిటీ సభ్యులు ఎంపీ అరుణకు సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, భాస్కర్, శంకర్ రెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, వెంకట్రాములు, మహేందర్ రెడ్డి, సమరసింహారెడ్డి, పీవీ నర్సింహారెడ్డి, కృష్ణయ్యగౌడ్, హన్మంతు పాల్గొన్నారు.

భూ సేకరణపై గ్రామసభ



గ్రామసభలో పాల్గొన్న ఆర్డీఓ

ఊట్కూర్: నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా సోమవారం మండలంలో భూ సేకరణపై ఆర్డీఓ రాంచందర్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. బాపూర్, తిప్రాస్‌పల్లి, పులిమామిడి, పెద్దపోర్ల గ్రామాలలో గ్రామ సభలు ఏర్పాటు చేసి భూములు కోల్పోతున్న రైతుల జాబితా తదితర వివరాలను చదివి వినిపించారు. భూ సేకరణలో రైతులకు అన్యాయం జరిగితే అధికారులకు ఫిర్యాదులు చేయవచ్చని సూచించారు. బాపూర్ శివారులో తమ భూములలో కొలతలు చేసి జెండాలు పాతారని, జాబితాలో తమ పేర్లు లేవని తిప్రాస్‌పల్లి గ్రామానికి చెందిన పలువురు ఆరోపించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రైతులు ఫిర్యాదు చేస్తే మళ్లీ సర్వే చేయించి రైతులకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఆర్ఓ రవి, ఏఈఈ సురేశ్, ఆర్ఐ కృష్ణారెడ్డి, ఎస్ఐ కృష్ణంరాజు పాల్గొన్నారు.

అధికారులను సస్పెండ్ చేయాలని ధర్నా



ధర్నాలో పాల్గొన్న సీపీఐఎంఎల్ నాయకులు

ఊట్కూరు: మండలంలోని బిజ్వార్ గ్రామంలో అక్రమంగా ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్న గ్రామ కార్యదర్శి, ఎంపీడీఓలను సస్పెండ్ చేయాలని కోరుతూ సోమవారం సీపీఐఎంఎల్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐఎంఎల్ రాష్ట్ర నాయకుడు కృష్ణారెడ్డి మాట్లాడుతూ పలువురు రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్న అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. దీనికి బాధ్యులైన కార్యదర్శి, ఎంపీడీఓను తక్షణమే సస్పెండ్ చేయాలని అలాగే ఇళ్ల నిర్మాణాలకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సూపరిండెంటెంట్ రాఘవేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలి



మాట్లాడుతున్న బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బొలిగెలి శ్రీనివాసులు

మాగనూర్(మక్తల్): కృష్ణ మండలం ముడుమాల్ గ్రామంలో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బొలిగెలి శ్రీనివాసులు కోరారు. అధికార పార్టీ నాయకుల అండతో కొందరు రాత్రి వేళల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని పేర్కొన్నారు. ఇసుక మాఫియా రూ.కోట్లాది ప్రభుత్వ సంపదనను దోచుకుంటుంటే పోలీసు, రెవెన్యూ అధికారులు మాత్రం మామూళ్ల వేటలో మునిగిపోయారని ఆరోపించారు. ఇప్పటికైన అధికారులు అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవాలని లేకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బండారి చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి జుట్ల సరేందర్, మక్తల్ నియోజకవర్గ ఇంఛార్జి పాలెం వెంకటయ్య పాల్గొన్నారు.

గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూస్తాం

నవాబుపేట: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు, లారీలు అందుబాటులో ఉండేలా చూస్తామని జిల్లా మార్కెటింగ్ అధికారి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని కొల్లూర్, లింగంపల్లి, కాకర్లపహాడ్, నవాబుపేట గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలానికి 14వేల గన్నీబాగ్యులు సరఫరా చేశామని.. ప్రతి కేంద్రంలో 5వేల బస్తాలు అందుబాటులో ఉంచినట్లు వివరించారు. రైతుల నుంచి ధాన్యం త్వరగా కొనుగోలు చేసి.. మిల్లులకు తరలించే విధంగా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన రైతుల వివరాలను వెనువెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు.

గ్రామపంచాయతీ సిబ్బందికి దుస్తుల పంపిణీ



ధన్వాడ: ధన్వాడ గ్రామ పంచాయతీ కార్మికులకు కెంచె రఘురాజ్ దుస్తులను పంపిణీ చేశారు. కెంచె యదయ్య, కుసుమమ్మ కుమారుడు నరసింహ జన్మదినం సందర్భంగా సోమవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యయంలో పంచాయతీ సిబ్బందికి దుస్తులను అందజేశారు.

దేవాలయం నిర్మాణానికి భూమి పూజ



ధన్వాడ: పేద ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవ కార్యక్రమాలు కొనసాగిస్తానని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రాజ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం ధన్వాడ మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో రేణుక ఎల్లమ్మ దేవాలయం నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో దేవాలయాల అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని విద్యా, వైద్యపరంగా కూడా ప్రజలకు సహాయ సహకరాలు అందజేస్తానని తెలిపారు.

ఇసుక టిప్పర్, ట్రాక్టర్ పట్టివేత

కొత్తపల్లి: మద్దూరు పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ అలాగే ఓ ట్రాక్టర్‌ను టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. భూనీడు గ్రామ సమీపంలోని వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. టిప్పర్ డ్రైవర్ వీరప్ప, ఓనర్ జయరాం అలాగే ట్రాక్టర్ ఓనర్ హనిమ్రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు.

మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి

మరికల్: రైతులను దోచుకుంటున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్రామారెడ్డి, నాయకులు గోపాల్ కోరారు. సోమవారం జిల్లాలో పలు మిల్లులను వారు తనిఖీ చేయగా రైతుల నుంచి అనేక ఫిర్యాదులు వచ్చాయన్నారు. క్వింటాల్‌కు 6 కిలోల చొప్పున తరుగు తీస్తు నింబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్న రైస్ మిల్లులపై తక్షణమే సివిల్ సప్లయ్ అధికారులు క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. రాంపూర్ మిల్లుకు ఓ రైతు 280 క్వింటాళ్ల ధాన్యం తీసుకెళ్తే 18 క్వింటాళ్లు తగ్గించి బిల్లు ఇచ్చారని ఆరోపించారు. రైతులను నిలువునా దోచుకుంటున్న ఇలాంటి వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

నర్సు వృత్తి ఎంతో పవిత్రమైనది



నర్సులను సన్మానిస్తున్న వైద్యులు

నారాయణపేట: నర్సు వృత్తి ఎంతో పవిత్రమైనదని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాంకిషన్ అన్నారు.సోమవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో ఘనంగాజరుపుకున్నారు.అనంతరంఆసుపత్రిలోని నర్సులను సత్కరించి వారి సేవలను కొనియాడారు.

మాగనూర్(మక్తల్): అంతర్జాతీయ నర్సుల దినోత్సవ వేడుకలను సోమవారం మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఘనంగా నిర్వహించారు. మక్తల్ పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు బి.గోపాలం, కార్యదర్శులు భాస్కర్‌ల ఆధ్వర్యంలో 29 మంది నర్సులను సభ్యులు సన్మానించారు. కరోనా మహమ్మారిని నివారించడంలో నర్సుల సేవలు వెలకట్టలేనివని, అలాంటి వారిని సన్మానించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి లింగయ్య, మల్లికార్జున్, పీఈటీలు నీలి రాఘవేందర్, రమేష్‌కుమార్, మెడికల్ సిబ్బంది సుధాకర్ పాల్గొన్నారు.

దామరగిద్ద: ఆస్పత్రుల్లో వైద్యులతో పాటు రోగులకు సేవలందించడంలో నర్సుల సేవలు వెలకట్టలేనివని వైద్యాధికారి సుదేష్ణ అన్నారు. సోమవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా నర్సింగ్ ఆఫీసర్ నర్మద, ఎల్లమ్మలను శాలువా పూలదండలతో సత్కరించారు. అనంతరం ఆస్పత్రుల్లో వారందించే సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ వెంకట్రామరెడ్డి, సూపర్‌వైజర్ వెంకటేష్, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



డీటీకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అమరచింత: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో దళితులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి రవీందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు దళితులను సామాజికంగా, ఆర్థికంగా ఆదుకుంటామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇల్లు పంపిణీలో దళితులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. రాజీవ్ యువ వికాశం పథకానికి సిబిల్ స్కోర్ నిబంధన పెట్టడం సరికాదన్నారు. ఎలాంటి నిబంధనలు లేకుండా దళితులకు సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. ప్రతి నియోజకవర్గంలో దళితులకు ఇందిరమ్మ ఇళ్లను 50 శాతం కేటాయించాలని, రాజీవ్ యువ వికాసంలో పెట్టిన నిబంధనలను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

'బడిబాట'లో భాగస్వాములు కావాలి



భవిత కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈఓ ప్రవీణ్‌కుమార్

జడ్చర్ల టౌన్: ప్రతి శుక్రవారం నిర్వహించే బడిబాట కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డీఈఓ ప్రవీణ్‌కుమార్ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఫిజియోథెరిఫి విధానాన్ని పరిశీలించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు త్వరగా కోలుకునేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని కేంద్రం నిర్వాహకులకు సూచించారు. బడిబాట కార్యక్రమంలో మహిళా సంఘాలు, యువజన సంఘాలను భాగస్వామ్యం చేసి.. బాలబాలికలు పాఠశాలకు వచ్చేలా చూడాలన్నారు. అదే విధంగా ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను గుర్తించి వారి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తిగా ఇంటివద్దే ఉండే వారికి అవసరమైన సలహాలు, సూచనలు అందించాలన్నారు. డీఈఓ వెంట ఎంఈఓ మంజులాదేవి, సీఎంఓ బాలుయాదవ్, ఐఈఆర్పీ విజయ, సునీత ఉన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

కోయిల్‌కొండ: ఫర్టిలైజర్ దుకాణాల్లో రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎరువులు, విత్తనాల స్టాక్ తదితర రికార్డులను పరిశీలించారు. నాణ్యమైన విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని నిర్వాహకులకు సూచించారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించిన రశీదు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.